నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం

షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనో-పెడ్రో మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్

బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలింది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డట్టైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్‌ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.

దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ప్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరపున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రోస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహూహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ప్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ప్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ప్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ తపతప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్‌ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ప్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)
భారత్: 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహూహు 3/15)

భారత షూటర్లకు మరో స్వర్ణం

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్

లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌మోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

సఫారీల శుభారంభం

• వెస్టిండీస్‌పై ఘనవిజయం

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకో లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీఎంహెచ్ సూపరింటెండెంట్ పోస్టుపై అనిశ్చితి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి(జీఎంహెచ్) సూపరింటెండెంట్ ఉన్నట్లా? లేనట్లా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోగా, డీఎంఈ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. కాగా, ఇటీవలే జీఎంహెచ్‌కు హైదరాబాద్ నుంచి ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ రాజేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగాలని డీఎంఈ ఆదేశించారు. అయితే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోలేనని డీఎంఈకి ఆమె మొరపెట్టుకున్నది.

35మంది ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్

సుబేదారి, అక్టోబర్ 4 : వరంగల్ నగరంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న 35మంది డ్రైవర్లకు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో లైసెన్స్‌లు అందజేశారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న ఆటో డ్రైవర్లకు లైసెన్స్ ఇప్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా గమ్యస్థానాలకు తరలించడం ట్రాఫిక్ పోలీసుల లక్ష్యమని, అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని సీపీ తెలిపారు.

ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తున్న సీపీ

గర్భిణికి వైద్యం నిరాకరణ

జనగామ రూరల్, అక్టోబర్04: మీ ఊరెక్కడ.. ఇక్కడి ఆసుపత్రికి ఎందుకొచ్చావ్.. అంటూ ఓ గర్భిణికి వైద్య సిబ్బంది వైద్యం నిరాకరించిన ఘటన శుక్రవారం జనగామ జిల్లా జనగామ మండలంలోని పసరమడ్ల గ్రామ శివారు చంపక్ హిల్స్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో జరిగింది. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన శ్రుతికి యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆమె ఆధార్‌కార్డులో యాదగిరిగుట్ట అని ఉండడంతో అమెకు వైద్యం చేయడానికి నిరాకరించారు. అమ్మగారి ఊరు అయిన జనగామకు వచ్చి గతంలో వైద్య పరీక్షలు ఇదే ఆసుపత్రిలో చేసుకుంది. కానీ ఇప్పుడు వైద్యం చేయించుకోవడానికి ఆసుపత్రికి రావడంతో ఓపీ రాయిస్తుండగా ఆధార్ కార్డులో యాదగిరిగుట్టగా ఉండడంతో ఆమెను మీ జిల్లాకు పోయి వైద్యం చేయించుకోవాలని వైద్య సిబ్బంది చెప్పారు. దీంతో తను పుట్టింది ఇక్కడే అని, ఈ ఆసుపత్రికి ఇతర జిల్లాల వారు రావడం లేదా అని నిలదీశారు. దీంతో వైద్య సిబ్బంది కోపంతో నీ జిల్లాకు పోయి చూపించుకో అంటూ దురుసుగా మాట్లాడారని బాధితురాలు తెలిపారు. కొన్ని నెలల నుంచి వైద్య పరీక్షలు ఇక్కడే చేయించుకుంటున్నానని చెప్పినా కూడా డాక్టర్లు చూడకుండా బయటకు పంపారన్నారు. ఎట్టకేలకు వైద్య సిబ్బంది గర్భిణిని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేకు అడ్డంకులు

- **14 గ్రామాల్లో 319.20 ఎకరాలు**
- **25 కిలోమీటర్లలో సర్వే పూర్తి**
- **భూములు కోల్పోతున్న 515 మంది రైతులు**
- **అరకొర పరిహారంపై ఆగ్రహం**
- **అదనపు పరిహారం కోసం అన్నదాతల అప్పీలు**
- **ఇప్పటికే రైతులతో కలెక్టర్ సమావేశం**

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే మ్యాప్

జయశంకర్ భూపాలపల్లి. అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లా మీదుగా వెళ్తున్న మంచిర్యాల టు విజయవాడ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే (ఎన్‌హెచ్ 163 జి)కు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. భూములకు అధికారులు అరకొర పరిహారం అందించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎరాకు రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల విలువైన తమ భూములకు రూ.6 లక్షలు మాత్రమే చెల్లించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అడిగిన పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 25 కిలోమీటర్ల పొడవునా 14 గ్రామాల్లో పరిధిలో 319.20 ఎకరాల భూమిని 515 మంది రైతులు కోల్పోతున్నారు. అధికారులు ఇప్పటికే భూ సర్వే పూర్తి చేసి అవార్డు పాస్ చేయగా నేషనల్ హైవే అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. ఇప్పటికే కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీవో మంగీలాల్ పలుమార్లు రైతులతో సమావేశమయ్యారు. అదనపు పరిహారం కోసం అప్పీలు చేసుకోగా తప్పకుండా న్యాయం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారని రైతులు చెప్తున్నారు.

కాల్వపల్లి వద్ద ప్రారంభం.. రంగాపూర్‌లో పూర్తి

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే (ఎన్‌హెచ్ 163 జి) జిల్లాలో 25 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరుగనుంది. చిట్యాల మండలం కాల్వపల్లి గ్రామ లిమిట్స్‌లో హైవే ప్రారంభం అవుతుందని, మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ లిమిట్స్‌లో పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. కాల్వపల్లి, అందుకుతండా, వెలిశాల, అంకుశాపూర్, పంగిడిపల్లి, రాఘవాపూర్, రామకృష్టాపూర్(టి), సోమనపల్లి, టేకుమట్ల, నవాబుపేట, ఇస్పేట, మేదరమెట్ల, మొగుళ్లపల్లి, రంగాపూర్ గ్రామాల నుంచి హైవే నిర్మాణం జరిపేలా ఎన్‌హెచ్ అధికారులు ప్లాన్ తయారు చేశారు. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో 14 గ్రామాల్లో 319.20 ఎకరాలను అధికారులు స్వాధీనం చేసుకోబోతున్నారు.

అరకొర పరిహారం

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రైతుల నుంచి 319.20 ఎకరాలను సేకరించేందుకు సిద్ధమైన ప్రభుత్వం అరకొర పరిహారం చెల్లిస్తోంది. ఇప్పటి వరకు 40 శాతం మంది రైతులకు రూ. 6 లక్షల చొప్పున పరిహారం అందించింది. మిగిలిన వారు తీసుకోలేదు. రూ. 6 లక్షలు తీసుకున్న రైతులతో పాటు పరిహారం తీసుకోని రైతులు తమ భూములకు మార్కెట్‌లో ఎకరాలకు రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల డిమాండ్ ఉందని, మంచి పంటలు పండే భూములు అప్పగిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. మీరు ఇచ్చే అరకొర డబ్బులతో మరో చోట భూమిని కొనే పరిస్థితి లేదని, భూమినే నమ్ముకుని బతుకుతున్న తాము దిక్కులేని వాళ్లమవుతామని అధికారులకు విన్నవించుకుంటున్నారు. ఆమోదయోగ్యమైన పరిహారం అందించాలని కోరుతున్నారు.

మార్కెట్ విలువ చెల్లించాలి

నేషనల్ హైవే కోసం మా నుంచి తీసుకునే భూమికి మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి. నవాబుపేట శివారులో 500, 501 సర్వే నంబర్లలో నా 10 గుంటల భూమిని హైవే కోసం అధికారులు తీసుకుంటున్నారు. ఇక్కడ నా భూమికి ఎకరాకు రూ.50 లక్షల విలువ ఉంది. కానీ, అధికారులు రూ.6 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అప్పటి వరకు మా భూములు ఇవ్వం.

– కనిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నవాబుపేట, చిట్యాల మండలం

కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు

శంకర్‌నాయక్ కుటుంబానికి హరీశ్‌రావు పరామర్శ

రాయపర్తి, అక్టోబర్ 4: ఊకల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని బాలాజీతండాకు చెందిన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి శుక్రవారం శంకర్‌నాయక్ నివాసానికి చేరుకున్నారు. కేవ్లానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఊకల్‌కు చెందిన తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి నివాసానికి చేరుకున్న వారు తేనీటి విందులో పాల్గొన్నారు.

జర్నలిస్టు వేధింపులతో కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

కురవి, అక్టోబర్ 4 : జర్నలిస్టు వేధింపులను తట్టుకోలేకపోతున్నానంటూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని తట్టుపల్లి పంచాయతీ కార్యదర్శి వంగూరి నాగలక్ష్మి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. రెండు పేజీల లేఖను రాసి గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే దోమల పిచికారీ మందు తాగింది. లేఖలో పేర్కొన్న ప్రకారం.. తట్టుపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ చానల్ ఇండిపెండెంట్ రిపోర్టర్ దొంతు యాదగిరి కొద్ది రోజులుగా కార్యదర్శి నాగలక్ష్మి ఏ పనిచేసినా తప్పులు వెతకడమే కాకుండా పై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడు. గత నెల 27న సమర్పించాల్సిన ఓటరు జాబితాను 28ప అధికారులకు అందజేయడంతో వారు కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయితే అది కార్యదర్శికి అందకముందే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైంది. దీంతో తాను మానసికంగా వేధింపులను తట్టుకోలేకపోతున్నానని, జీపీ కార్యాలయంలోనే ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖలో రాసి, దోమల పిచికారీ మందును తాగింది. అంతకు ముందే విషయాన్ని ఎంపీవో గౌస్‌కు నాగలక్ష్మి ఫోన్‌లో చెప్పడంతో ఆయన హుటాహుటిన గ్రామానికి చేరుకొని కారులో దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వీరబాబు ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా ఓటరు జాబితా ఆలస్యం కావడంతో షోకాజ్ నోటీసు ఇచ్చిన మాట వాస్తవమేనని, కానీ ఏ అధికారి వేధించలేదన్నారు. నాగలక్ష్మికి న్యాయం చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, నాయకుడు రాములు అధికారులను కోరారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న కార్యదర్శి నాగలక్ష్మి

బకాయిలు వెంటనే చెల్లించాలి

ఖిలావరంగల్, అక్టోబర్ 4: జిల్లాలోని రైస్ మిల్లర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ సత్య శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే 55 నుంచి 60 శాతం బియ్యం మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. సీజన్‌కు ముందే ప్రభుత్వం జీవో ఇవ్వాలని కోరారు. 2018-19 నుంచి 2023-24 వరకు రావాల్సిన ట్రాన్స్‌ఫోర్ట్, ఎఫ్‌సీఐ రవాణా చార్జీలను వెంటనే చెల్లించాలని కోరారు. సంచులను తీసుకోవడంలో గత మేనేజర్ నిరాకరించడంతో వాటిని భద్రపరిచేందుకు గోదాముల్లో స్థలం లేక మార్కెట్ ధర ప్రకారం రూ. 7 నుంచి రూ. 10 వరకు విక్రయించినట్లు తెలిపారు. అధికారులు ధర నిర్ణయిస్తే దాని ప్రకారం చెల్లిస్తామన్నారు. గత సీజన్‌లో నాన్ ఎఫ్‌ఏసీ ధాన్యాన్ని అధికారులు బలవంతంగా మిల్లుల్లో దించడం వల్ల రైస్‌మిల్లర్లు నష్టపోయారని, కొన్ని మిల్లులు డిఫాల్ట్‌లో పడినట్లు గుర్తు చేశారు. సన్న బియ్యం 60